పరిసరాల పరిశుభ్రతతో రోగాలకు దూరం

ప్రజాశక్తి- పెదబయలు : పరిసరాలు శుభ్రతతోనే రోగాలను అరికట్టవచ్చని సిఆర్‌పిఎఫ్ జి198 బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ శరణ్‌రాజు అన్నారు. స్వచ్ఛ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, శిశుజనన కేంద్రం, అంబేద్కర్ కూడలి తదితర ప్రాంతాల్లో శనివారం సిఆర్‌పిఎఫ్ పోలీసులు చెత్త చెదారం తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి గొర్లె నిఖిల్, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్ నిర్వహిస్తున్న సిఆర్‌పిఎఫ్ సిబ్బంది

విల్లు ఎక్కుపెడుతున్న వి.శ్రీనివాసరావు, వేదికపై అప్పలనర్స, సురేంద్ర, గంగరాజు తదితరులు

హైడ్రోపై అరణ్య గర్జన

- ప్రాజెక్టుల పేరిట ముంచితే ఊరుకోం
- అడవిని కార్పొరేట్లకు కట్టబెడతారా ?
- పాలకులారా ఖబడ్దార్ : వి.శ్రీనివాసరావు, సురేంద్ర, అప్పలనర్స తదితరులు
- మజ్జివలసలో భారీ బహిరంగ సభ, ర్యాలీ
- వేలాదిగా కదిలొచ్చిన ఆదివాసీలు

భారీ ర్యాలీలో వి.శ్రీనివాసరావు, నాయకులు, గిరిజనులు

ప్రజాశక్తి - అరకులోయ రూరల్ : తమను జల సమాధి చేసే హైడ్రో పవర్ ప్రాజెక్టులు వద్దంటూ ఆదివాసీలు గర్జించారు. ఆ ప్రాజెక్టులకు అనుమతుల కోసం జారీ చేసిన జిఒలు 51, 13, 2లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అడవులను కార్పొరేట్ కంపెనీలకు అమ్మొద్దని, హైడ్రో పవర్ ప్రాజెక్టులు ఏర్పాటు చేసి గిరిజనులను జల సమాధి చేయొద్దని డిమాండ్ చేస్తూ ఆదివాసీ గిరిజన సంఘం, హైడ్రో పవర్ ప్రాజెక్టు వ్యతిరేక కమిటీ ఆధ్వర్యాన హుకుంపేట మండలం బూర్జ పంచాయతీ మజ్జివలసలో శనివారం ఆదివాసీ అరణ్య గర్జన సభ జరిగింది. తొలుత ఏజెన్సీ నలుమూలల నుంచి భారీగా తరలివచ్చిన ఆదివాసీలంతా భారీ ప్రదర్శన చేపట్టారు. తమ పట్ల పాలకుల తీరును నిరసిస్తూ నినాదాలతో హోరెత్తించారు. ర్యాలీ అనంతరం జరిగిన సభకు ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కృష్ణారావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ హైడ్రో పవర్ ప్రాజెక్టులు ఏర్పాటు చేసి గిరిజనులను జల సమాధి చేస్తామంటే ఊరుకునేది లేదన్నారు. ఇప్పటికే ఏజెన్సీలో అడవులు, జీవరాశులను పాలకులు నాశనం చేసేశారన్నారు. పర్యావరణం పూర్తిగా ధ్వంసమైందన్నారు. ఎప్పుడు వర్షం వస్తుందో, రాదో కూడా తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ఉన్న ఈ ప్రకృతిని కూడా నాశనం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూస్తున్నాయన్నారు. కార్పొరేట్ శక్తుల లాభాల కోసం అడవులను కట్టబెడుతున్నాయన్నారు. అంతర్జాతీయ గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ జనాలు నివాసం లేని చోట, పంటలు పండనిచోట ప్రాజెక్టులు, పరిశ్రమలు పెట్టుకోవాలని చెబితే దానికి విరుద్ధంగా ఏజెన్సీలో పాలకుల చర్యలు ఉన్నాయన్నారు. గిరిజనులు అంటే ప్రభుత్వానికి లెక్క లేదన్నారు. ప్రాజెక్టులు, ఉద్యోగాల పేరిట ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో సీలేరు జెన్కోలో విద్యుత్ ప్రాజెక్టు ఉందని, అక్కడ 250 మంది ఉద్యోగులు ఉన్నారని, వారిలో గిరిజనులు 20 మంది మాత్రమే ఉద్యోగులుగా ఉన్నారని తెలిపారు. వంద, రెండు వందల ఉద్యోగాల కోసం వేలాది మంది గిరిజనులు, పంట పొలాలను జల సమాధి చేస్తామంటే ఆదివాసీలు చూస్తూ ఊరుకోరన్నారు. అదానీ, నవయుగ, షిరిడీ సాయి కంపెనీలకు ఏజెన్సీని కట్టబెట్టేందుకు ప్రభుత్వాలు కుట్రలు పన్నాయన్నారు. జిఒ 3 పునరుద్ధరణ విషయంలో కూటమి ప్రభుత్వం మాట తప్పిందన్నారు. ఆ హామీ నెరవేరి ఉంటే ఏడు వేల ఉద్యోగాలు ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీలకు దక్కేవన్నారు. హైడ్రో ప్రాజెక్టుల కోసం జారీ చేసిన జిఒలను రద్దు చేస్తున్నట్టు అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటించాలని డిమాండ్ చేశారు. డోలీమోతలు లేని రాష్ట్రం వంటి మాటలు హామీలకే పరిమితమయ్యాయని శ్రీనివాసరావు దుయ్యబట్టారు. ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ అదానీ, నవయుగ కంపెనీల కోసం చట్టాలను పాలకులు చుట్టాలుగా మార్చివేశారని విమర్శించారు. గ్రామసభ, పీసా కమిటీ, ప్రజల తీర్మానం లేకుండా బడా కార్పొరేట్ కంపెనీలకు హైడ్రో ప్రాజెక్టుల కోసం భూములు ధారాదత్తం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఆదివాసీ గిరిజన సంఘం, సిపిఎం ఎర్రజెండా గిరిజనులకు అండగా ఉన్నాయన్నారు. ఎవ్వరూ భయపడవద్దని, పోరాటాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స మాట్లాడుతూ హైడ్రో పవర్ ప్రాజెక్టులు రద్దు చేయాలని గిరిజనులు ధర్నాలు, నిరసనలు చేసి, వినతి పత్రాలు అందించి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు తీర్మానాలు చేసి ప్రభుత్వానికి పంపించినా సర్కారుకు చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. చంద్రబాబు గిరిజనులను ఎలా మోసపుచ్చుతున్నదీ అప్పలనర్స వివరించారు. హైడ్రోపై భవిష్యత్తు పోరాటానికి సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, ప్రజాప్రతినిధులు వారి పదవులకు రాజీనామా చేసి ఉద్యమంలోకి రావాలన్నారు. అనంతగిరి జెడ్‌పిటిసి దీసరి గంగరాజు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, ఎంపిటిసి మజ్జి హరి మాట్లాడుతూ జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్, ఎపిఎస్ ఆర్‌టిసి రీజనల్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర హైడ్రో పవర్ ప్రాజెక్టులపై ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. వారి వైఖరిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొర్రా త్రినాధ్, చిన్నయ్యపడాల్, వి.ఉమామహేశ్వరరావు, ఎస్‌బి.పోతురాజు, జిల్లా కమిటీ సభ్యులు కిండంగి రామారావు, కిల్లో మొస్య, ఎస్.హైమవతి, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ధర్మాన పడాల్, హుకుంపేట మండల కార్యదర్శి వి.లక్ష్మణరావు,సివేరి.కొండలరావు, సుడిపల్లి కొండలరావు, సోమెల నాగులు, భూర్జ ఎంపిటిసి మజ్జి హరి, సర్పంచ్ పాంగి మొత్తి, ఉప సర్పంచ్ సింబోయి, వాలాసి సర్పంచ్ సేంబీ సన్యాసిరావు, వేంగడ నాయకులు బుట్టన్న, బస్కి పంచాయితీ సర్పంచ్ పాడి రమేష్, అరకు వైస్ ఎంపిపి కిల్లో రామన్న, లోతేరు ఎంపిటిసి నొబో, సుంకరమెట్ట సర్పంచ్ గెమ్మెల చినబాబు, హైడ్రో పవర్ ప్రాజెక్టు వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్లు మజ్జి సురేష్ కుమార్, మజ్జి కృష్ణంరాజు, పాంగి బొంజుబాబు, స్వామి, సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న పాల్గొన్నారు.

అరకు కాఫీకి ప్రతిష్టాత్మక అవార్డు

- 'ఫైనాన్షియల్ ట్రాన్స్‌పర్మేషన్' విభాగంలో ఛేంజ్‌మేకర్ ఆఫ్ ది ఇయర్ పురస్కారం
- జిసిసి ప్రస్థానంలో మరో గొప్ప మైలురాయి

అవార్డు అందుకుంటున్న జిసిసి వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కల్పనాకుమారి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ: జాతీయ స్థాయిలో గిరిజన సహకార సంస్థ (జిసిసి)కి ఘనమైన గుర్తింపు దక్కింది. ముంబయిలో శుక్రవారం నిర్వహించిన బిజినెస్ లైన్ చేంజ్‌మేకర్ అవార్డ్స్ - 2025 ఏడో ఎడిషన్‌లో కేంద్ర పెట్రోలియం, సహజవాయు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి చేతులమీదుగా జిసిసికి చెందిన అరకు వ్యాలీ కాఫీకి 'ఫైనాన్షియల్ ట్రాన్స్ఫర్మేషన్' విభాగంలో ఛేంజ్‌మేకర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు - 2025 లభించింది. ఈ పురస్కారాన్ని గౌరవ అతిథి నుంచి జిసిసి వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కల్పనా కుమారి స్వీకరించారు.

జిసిసి విజయ ప్రస్థానమిలా..

1956లో స్థాపితమైన నాటి నుంచి గిరిజనుల ఆర్థిక, సామాజిక అభివృద్ధి పట్ల నిబద్ధతతో పనిచేస్తున్న జిసిసి 1970లలో అరకు వ్యాలీలో ప్రవేశపెట్టిన కాఫీ సాగు ద్వారా గిరిజనుల జీవనశైలిలో మార్పు తీసుకువచ్చింది. అది వారి జీవనోపాధిని పెంచడంతో పాటుగా వ్యవసాయాన్ని స్థిరమైన, ఆదాయకరమైన వృత్తిగా తీర్చిదిద్దడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కూడా పరిరక్షించింది. అరకు కాఫీ విజయగాథ పటిష్టమైన, సంఘటితమైన కృషికి ప్రత్యక్ష ఉదాహరణ. ముఖ్యంగా గత దశాబ్ద కాలంగా పాడేరు, చింతపల్లి మండలాలలోని డివిజనల్ మేనేజర్లు, మేనేజర్లు, కాఫీ సేకరణ సిబ్బంది రైతులతో నేరుగా పనిచేస్తూ ప్రాథమిక స్థాయిలోనే నాణ్యతను నిర్ధారించారు. అదే విధంగా జిసిసి ప్రధాన కార్యాలయంలోని కాఫీ విభాగం సమన్వయం, మార్గదర్శనం, పర్యవేక్షణ ద్వారా ప్రతి దశలో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా కాఫీని తీర్చిదిద్దారు. ఈ సమిష్టి కృషి ఫలితంగా గిరిజన రైతులకు స్థిర ఆదాయం, గౌరవభరిత జీవితం, అంతర్జాతీయ గుర్తింపు లభించాయి. 2019లో జిఐ ట్యాగ్ పొందిన తరువాత అరకు కాఫీకి ప్రీమియం అంతర్జాతీయ మార్కెట్లను తెరిచారు. ఈ బ్రాండ్ సేంద్రీయ స్వచ్ఛత, మధుర సువాసన, ప్రత్యేక రుచితో విశిష్టతను సంపాదించుకుంది.

ఈ ఘన వారసత్వాన్ని కొనసాగిస్తూ 2024లో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని చింతపల్లి, జికె.వీధి మండలాల్లో 2600 మంది రైతులకు చెందిన 6 వేల ఎకరాల కాఫీ, మిరియాల తోటలకు సేంద్రియ ధ్రువీకరణ లభించింది. ఇప్పుడు మరో నాలుగు మండలాల్లో 15 వేల ఎకరాల విస్తీర్ణానికి ధ్రువీకరణ విస్తరించే ప్రణాళికలు రూపొందించబడ్డాయి. ఇది కాఫీ, మిరియాలతోపాటు రాగి, రాజ్మా, పసుపు, అల్లం వంటి పంటలకూ వర్తిస్తుంది. దీని ద్వారా 10 వేల మంది రైతులు లబ్ధి పొందనున్నారు. అదేవిధంగా ఏడాది ఆగస్టు 9న పాడేరులో జరిగిన ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో సిఎం చంద్రబాబు సమక్షంలో జిసిసి, టాటా కన్జూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ మధ్య అవగాహనా ఒప్పందం కుదిరింది. దీని ద్వారా దేశంలో తొలిసారిగా 'సేంద్రియ సాల్యూబుల్ కాఫీ ఉత్పత్తి ప్రారంభం కానుందని అధికారులు చెబుతున్నారు. అంతేకాకుండా, మౌలిక వసతుల బలోపేతం కోసం, నర్సీపట్నం సమీపంలోని మాకవరపాలెం మండలం, శెట్టిపాలెం గ్రామంలో ఆధునిక సాంకేతికతతో కూడిన ఇంటిగ్రేటెడ్ కాఫీ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం 12 ఎకరాల భూమిని కేటాయించి, రూ.10 కోట్లు మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టు విలువ ఆధారిత ఉత్పత్తుల అభివృద్ధి, మార్కెట్ వ్యాప్తిని పెంచనున్నట్టు చెబుతున్నారు.

అవార్డు స్వీకరించిన సందర్భంగా కల్పనా కుమారి మాట్లాడుతూ ఈ అవార్డు గిరిజన రైతులు, జిసిసి సిబ్బంది త్యాగం, అంకితభావానికి చిహ్నమని పేర్కొన్నారు. అరకు వ్యాలీ కాఫీ ఒక బ్రాండ్ మాత్రమే కాదని, అది గిరిజనుల గౌరవానికి, భారతదేశ గర్వానికి ప్రతీక అని తెలిపారు. గ్లోబల్ మార్కెట్లలో జిసిసి. అరకు వ్యాలీ కాఫీని విస్తరించడంలోను, రైతులకు మరింత గొప్ప పురోగతిని సులభతరం చేయడానికిగానూ ఎఐతో సహా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగిస్తామని చెప్పారు. పురస్కారాన్ని గిరి రైతులకు, జిసిసి ఉద్యోగులకు అంకితమచ్చారు.

తగ్గని గోదావరి వరద

నిండా మునిగిన అన్నదాత

చినుకు కోసం ఆకాశంవైపు ఆశగా ఎదురుచూసే అన్నదాత అదే చినుకు ప్రకోపించి తన బతుకు ఛిద్రం చేస్తుందని ఊహించలేదు. మరోసారి వరద రూపంలో గోదావరి పంటచేలు మింగేసింది. ఇప్పటికే వరి నాట్లు ముంపునకు గురై నష్టం వాటిల్లగా ఇప్పుడు మిరప పైరు కూడా నీట మునిగింది. రైతులకు అపారనష్టం వాటిల్లింది.

- భద్రాచలం వద్ద తగ్గుతూ.. పెరుగుతూ..
- పలు గ్రామాల్లో నీట మునిగిన వరి, మిర్చి పంటలు
- విఆర్ పురం మండలంలో పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు

నీటమునిగిన మిరప మొక్కలు

భద్రాచలం కూనవరం రహదారిపై మురుమూరు వద్ద వరద నీరు

ప్రజాశక్తి-ఎటపాక: భద్రాచలం వద్ద గోదావరి వరద కాస్త తగ్గుముఖం పడినప్పటికీ లోతట్టు గ్రామాల్లో ముంపు ప్రభావం నుండి బయటపడలేకపోతున్నాయి. భద్రాచలం వద్ద శనివారం ఉదయం 46.60 అడుగుల వద్ద ఉన్న గోదావరి సాయంత్రానికి 44.30 అడుగుల వద్ద ప్రవహిస్తోంది. భద్రాచలం వద్ద రెండు అడుగుల మేర తగ్గ ముఖం పట్టినప్పటికీ నెల్లిపాక , తోటపల్లి, గన్నవరం, గౌరీదేవి పేట, నందిగామ గ్రామాల్లో పొలాలు మాత్రం వరద ముంపు నుండి బయటపడలేదు. ఇప్పటికే ఆలస్యంగా నాటిన మిరప చేలు వరద ముంపునకు గురి కావడంతో రైతులు దిక్కు తోచని స్థితిలో ఉన్నారు. మరల పంట వేయాలంటే ఎగరానికి 20వేలు ఖర్చు అవుతుందని ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని కోరుతున్నారు.

విఆర్‌పురం: మండలంలో వారం రోజుల నుంచి ఉన్న వరద కారణంగా చిన్నమట్టపల్లి పంచాయతీ పరిధిలో అనేక గ్రామాల్లో వరి నాట్లు నీట మునిగాయి. దాదాపు 300 ఎకరాల్లో వరి పంట పూర్తిగా మునిగిపోయింది. తక్షణమే ప్రభుత్వం స్పందించి సర్వే చేసి పంట నష్టపరిహారం ఎకరానికి రూ.20,000 అందించాలని ఎంపిటిసి పూనెం ప్రదీప్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన నీటమునిగిన పంటలను పరిశీలించారు. ఆయనతో పాటు రైతులు కారం తమ్మయ్య పండా మారయ్య, సున్నం చంద్రరావు, కుంజాప్రసాద్ పాల్గొన్నారు.

ప్యాకేజి ఇవ్వాలి

పోలవరం బాధితులకు తక్షణమే ప్యాకేజి ఇవ్వాలని చిన్నమట్టపల్లి పంచాయతీ సర్పంచ్ పిట్ట రామారావు, కోటం జయరాజు డిమాండ్ చేశారు. గుండుగూడెం, చింతరేగుపల్లి, పత్తిపాక, తుష్టివారిగూడెం కన్నాయిగూడెం, రామవరం పంచాయతీ వెంకన్నగూడెం లక్ష్మీనగర్ సోమలగూడెం, చొప్పెల్లి రామన్నపాడు గ్రామస్తులు రహదారి లేక ఇబ్బందిపడుతున్నారన్నారు. అదేవిధంగా వరి, మిర్చి పంటలు నీటమునిగిపోయి రైతులకు అపారనష్టం వాటిల్లిందని అధికారులు తక్షణమే స్పందించి బాధితులను ఆదుకోవాలని కోరారు. ముత్యాల మురళి.నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు..

మండలంలోని రామవరం, అడవి వెంకన్నగూడెం, తొష్టివారిగూడెం, కన్నాయిగూడెం, పోచవరం, ఇప్పూరు గ్రామాల మధ్య గల ప్రధాన రహదారుల వద్ద వాగుల్లోకి గోదావరి వరద ప్రవహించడంతో ఆయా గ్రామాలకు శుక్రవారం సాయంత్రం నుండి రాకపోకలు నిలిచిపో యాయి. అదేవిధంగా శ్రీరామగిరి సీతంపేట గ్రామాల మధ్య కూడా సాయంత్రం 6 గంటల నుండి రోడ్డు బ్లాక్ అయింది. మండలంలోని శ్రీరామగిరి నీట మునిగే అవకాశాలు ఉన్నాయని వాపోతున్నారు. భద్రాచలం వద్ద 45.50 తగ్గుముఖం పట్టినప్పటికీ వి ఆర్ పురం మండలంలో ఇంకా తగ్గుముఖం పట్టలేదు. కాస్త పెరుగుతూనే ఉంది.

నీటమునిగిన వరి పైరు పరిశీలిస్తున్న ఎంపిటిసి పూనెం ప్రదీప్‌కుమార్

'వనం - మనం'లో భాగస్వాములు కావాలి

ఐటిడిఎ పిఒ స్మరణ్‌రాజ్

ప్రజాశక్తి-రంపచోడవరం : ఏజెన్సీలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు, సిబ్బంది 'వనం-మనం' కార్యక్రమంలో భాగస్వాములు కావాలని రంపచోడవరం ఐటిడిఎ పిఒ స్మరణ్‌రాజ్ పేర్కొన్నారు. శనివారం ఐటిడిఎ సమావేశ భవనంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్, అడ్డతీగల, రంపచోడవరం సబ్ డిఎఫ్ఒ, ఉపాధి హామీ ఎపిడితో మండల వ్యవసాయశాఖ అధికారులు, మండల విద్యాశాఖాధికారులు, వెలుగు ఎపిడి, ఎపిఎంలతో వనం మనం ప్రోగ్రాంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ స్మరణ్ రాజ్ మాట్లాడుతూ ఏజెన్సీలో పర్యావరణ పరిరక్షణతో పాటు ఏజెన్సీలో గిరిజన రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా గిరిజన రైతులకు ఏ ఏ మొక్కలు కావాలో తెలుసుకొని మండల స్థాయి అధికారులు నివేదికలు సమర్పించాలన్నారు. ప్రభుత్వానికి సంబంధించిన నర్సరీలు, ప్రైవేట్ నర్సరీలు ఎన్ని ఉన్నాయో ఆరా తీశారు. వనం మనం ప్రోగ్రాం ద్వారా ఐటిడిఎ పరిధిలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులకు టార్గెట్ ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో 120 పంచాయతీల్లో 13354.5 ఎకరాల్లో12 లక్షల 83 వేల 851 మొక్కలు 2025 నుండి 2030 సంవత్సరం నాటికి ఐదు సంవత్సరాల వనం మనం ప్రోగ్రాం కు ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతిపాదనలు తయారు చేయడం జరిగిందన్నారు. అన్ని మండలాల్లోని ఎంపిడిఒలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి యాక్షన్ ప్లాన్ గురించి ఆరా తీశారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, ఇపిఒ జనరల్ డిఎన్వి రమణ, ఏజెన్సీ డిఇఒ వై. మల్లేశ్వరరావు, సబ్ డిఎఫ్ఒలు అనుష, సుబ్బారెడ్డి, ఉపాధి హామీ పథకం ఎపిడిలు శ్రీనివాస్ విశ్వనాథ్, ఎల్.రాంబాబు, పిహెచ్ఒ దేవదానం, వెలుగు ఎపిడి దేగలయ్య, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె. సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

భగత్‌రామ్ హత్యకేసుపై విచారణ జరపాలి

భగత్‌రామ్ భార్య, వారి కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం సీలేరులో ఈనెల 21 రాత్రి హత్యకు గురైన వంతల భగత్‌రామ్ హత్యకేసును పూర్తి స్థాయిలో విచారణ జరపాలని మృతుడు భార్యతో పాటు బంధువులు శనివారం డిమాండ్ చేశారు. చింతపల్లి క్యాంపులో బాధితులు స్థానిక విలేకరులతో సమావేశం అయ్యారు. భగత్‌రామ్‌పై ఎప్పటినుంచో నిందితుడు కక్ష గట్టి ఉన్నాడని పలుమార్లు హత్య చేస్తానని బెదిరించాడని పేర్కొన్నారు. హత్య జరుగుతున్న సమయంలో తనను 'వీళ్ల కొట్టేస్తున్నారు, చంపేస్తున్నారని' ఫోన్లో భగత్‌రామ్ మాటలు వినిపించాయని హత్య చేసింది ఒక్కడే కాకుండా ఇంకా ఎవరో ఉన్నారని ఆరోపించారు. భగత్‌రామ్ దగ్గర ఉన్న రూ.20 వేలు నగదు, ఒక సెల్ ఫోను ఏమైనట్లు అని ప్రశ్నించారు.

నిందితుడిని అరెస్టు చేయాలని పోలీసులు శ్రద్ధ చూపారని నిందితుడుతో పాటు మరికొంతమంది హత్యలో పాల్గొన్నట్లు అనుమానాలు ఉన్నాయన్నారు. పూర్తిస్థాయి విచారణ జరపాలని విజ్ఞప్తి చేశారు. భగత్‌రామ్ సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుంటే మరికొన్ని నిజాలు బయటపడతాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. నిందితులను చింతపల్లి క్యాంపు గ్రామంలోకి రానివ్వకుండా వేరే ప్రాంతానికి పంపించాలని చింతపల్లి క్యాంపు ప్రజలు స్థానిక ఎస్సై కే.రవీంద్రకు వినతిపత్రం అందజేశారు.

ఎంపికైన విద్యార్థులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎపిటిడబ్ల్యూఆర్ విద్యార్థులు

ప్రజాశక్తి - మారేడుమిల్లి : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 19 ఆధ్వర్యంలో గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్లో అథ్లెటిక్స్ విభాగంలో ఎపిటిడబ్ల్యూఆర్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 24న డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ గ్రౌండ్స్‌లో నిర్వహించారు. అథ్లెటిక్స్ విభాగంలో సిహెచ్ శ్రీను, జావిలిన్‌త్రో (సెకండ్ ప్లేస్), టి మురళీకిషోర్ 3000 మీటర్స్ (థర్డ్‌ప్లేస్) శనివారం రంపచోడవరం క్రీడా ప్రాంగణంలో జరిగిన కబడ్డీ, త్రోబాల్ పురుషుల విభాగంలో సిహెచ్ సాత్విక్‌దొర, టి.మురళీకిషోర్, వి.సుకుమార్, కబడ్డీలో ఎం.శేఖర్, ఎం అనిల్‌కుమార్‌దొర ఎంపికయ్యారు. విద్యార్థులంతా అండర్-19 వివిధ క్రీడాంశాల్లో త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌కు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ జి.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ పుల్లారావు తెలిపారు. ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్ లోవరాజును అభినందించారు.

ముగిసిన మావోయిస్టు వారోత్సవాలు

ప్రజాశక్తి-సీలేరు: మావోయిస్టు ఆవిర్భావ దినోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈనెల 21 నుంచి 27 వరకు నిర్వహించడానికి మావోయిస్టులు విస్తతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ, ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో కేంద్ర పోలీసు బలగాలు మొహరించి అణువణువునా గాలింపు చర్యలు చేపట్టారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో స్పెషల్ ఫోర్స్, బిఎస్ఎఫ్ బలగాల మొహరించి జల్లెడు పట్టారు. శనివారంతో ఇవి ముగియడంతో పోలీసులు, సరిహద్దు గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకు న్నారు. విశాఖ వయా నర్సీపట్నం సీలేరు మీదుగా భద్రాచలం వెళ్లే బస్ సర్వీస్ సీలేరు నైట్‌హాల్ట్ సర్వీస్‌లను 28 తేదీ ఆదివారం రాత్రి నుంచి తిరిగి నడిపేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు విశాఖ ఆర్టీసీ మేనేజర్ తెలిపారు.

ఘనంగా దసరా ఉత్సవాలు

ప్రజాశక్తి -సీలేరు: జికెవీధి మండలం ధారకొండలో దసరా ఉత్సవాలు రామాలయం ప్రాంగణంలో వైభవంగా జరుగుతున్నాయి. దుర్గాదేవి అమ్మవారు రోజుకొక అవతారం లో భక్తులకు దర్శన మిస్తు న్నారు. ధారకొండలో శనివారం భక్తులు అమ్మవారికి సారె సమర్పించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సారె ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

షేక్ నాజరవల్లిని సత్కరిస్తున్న ఎంపిపి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

ప్రజాశక్తి-చింతపల్లి : ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించడమే నిజమైన రాజకీయమని ఎంపీపీ కోరాబు అనూషదేవి అన్నారు. ఎంపీటీసీల పదవీకాలం సెప్టెంబర్ 24తో నాలుగేళ్ల పూర్తయిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సాంకేతిక అభివృద్ధి, సాంస్కృతిక అవగాహనతో పాటు ప్రజల అవసరాలను పరిష్కార బాధ్యత ఎంపీటీసీలదేనని పేర్కొన్నారు. మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు షేక్ నాజరవల్లి మాట్లాడుతూ ప్రజాసేవకు అంకితంగా తన కృషి కొనసాగుతుందని చెప్పారు. చింతపల్లి మండలంలోని అన్ని పంచాయతీ సర్పంచ్‌లు, ఎంపిటిసిలు హాజరై ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అనంతరం షేక్ నాజరవల్లిని పుష్పగుచ్ఛం శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఈగల్ టీమ్ ఇన్‌స్పెక్టర్ నాగర్జున

గంజాయి సాగు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి- చింతపల్లి : గంజాయి సాగు చట్ట రీత్యా నేరమని అల్లూరి జిల్లా ఈగల్ టీమ్ ఇన్‌స్పెక్టర్ డి.నాగర్జున అన్నారు. డ్రగ్స్ వినియోగం నివారణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఈగల్ టీమ్ ఆధ్వర్యాన ప్రత్యేక అవగాహన శిబిరం శనివారం నిర్వహించారు. చింతపల్లిలోని ఎస్ఆర్‌సి రోడ్ వర్కర్స్ అండ్ కాంట్రాక్ట్ సంస్థలో పనిచేస్తున్న కూలీలు, సిబ్బందితో జరిగిన ఈ కార్యక్రమంలో నాగార్జున మాట్లాడుతూ మాదకద్రవ్యాల వాడకం సమాజానికి, కుటుంబాలకు, ముఖ్యంగా యువత భవిష్యత్తుకు తీవ్రమైన ముప్పుగా మారుతోందని హెచ్చరించారు. డ్రగ్స్ వాడకం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, మానసిక దుష్ప్రభావాలు, కుటుంబ కలహాలు వంటి దుష్పరిణామాలను సవివరంగా వివరించారు. గంజాయి సాగు, రవాణా వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాల్లో పాల్గొంటే కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. డ్రగ్స్‌కు సంబంధించిన ఏదైనా అనుమానాస్పద సమాచారాన్ని ప్రజలు గమనిస్తే వెంటనే ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972కు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

భారీ అన్న సమారాధన

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలో కె.కోడాపల్లి పంచాయతీ బంధవీధి గ్రామంలో కనకదుర్గమ్మ తల్లి భవాని పీఠం వద్ద శుక్రవారం మధ్యాహ్నం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు వందలాదిమంది భక్తులు తరలివచ్చి అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో పలు గ్రామాల భక్తులు పాల్గొన్నారు

భూ సేకరణ వేగవంతం చేయాలి

- గిరిజనులకు ప్రత్యామ్నాయంగా భూములు ఇవ్వాల్సిందే
- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: పోలవరం ప్రాజెక్టులో భూములు కోల్పోయిన రైతులకు, గిరిజనులకు ప్రత్యామ్నాయ భూములివ్వాల్సిందేనని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసారు. శనివారం కలెక్టరేట్ నుండి రంపచోడవరం, చింతూరు డివిజన్ అధికారులు, తహశీల్దారులు, పోలవరం పరిపాలనాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రైతులకు ప్రత్యామ్నాయ భూములు సేకరణ, పునరావాసంపై సమీక్షించారు. చేపట్టిన పనులపై ఆరా తీశారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, భూ సేకరణ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలన్నారు. సమస్యలు ఏమైనా ఉత్పన్నం అయితే పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. పునరావాస కాలనీలకు ప్రజలను తరలించడానికి చర్యలు చేపట్టాలని సూచించారు. పునరావాస కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు. రైతులకు వ్యవసాయం చేయడానికి అనువుగా ఉన్న భూములను సమీకరించాలని చెప్పారు. పునరావాస కాలనీలకు దూరంగా రైతులకు భూములు కేటాయిస్తే ప్రయోజనం ఉండదని, గ్రామాలకు రెండు మూడు కిలోమీటర్ల దూరంలో వ్యవసాయానికి భూములను కేటాయించాలని సూచించారు. ప్రతీ వారానికి పనిలో పురోగతి కావాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన పంటలకు అనువుగా ఉన్న భూములు మాత్రమే గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో పోలవరం పరిపాలనాధికారి వి.అభిషేక్, రంపచోడవరం ఐటిడిఎ పిఒ స్మరణ్ రాజ్, సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్, చింతూరు పిఒ అపూర్వ భరత్, ప్రత్యేక ఉప కలెక్టర్ అంబేద్కర్, చింతూరు, రంపచోడవరం డివిజన్ల పరిధిలో పలువురు తహశీల్దారులు తదితరులు పాల్గొన్నారు.

కాలం చెల్లిన మందులు దహనం

దుర్వాసనతో ఇబ్బంది పడిన స్థానికులు

ప్రజాశక్తి-పెదబయలు : స్థానిక పశువైద్యాశాలలో మూగజీవాలకు వేయాల్సిన మందులు, వ్యాక్సిన్లకు కాలం చెల్లడంతో అధికారుల ఆదేశాల మేరకు శనివారం మధ్యాహ్నం టీచర్స్ క్వార్టర్స్, తపాలా కార్యాలయం మధ్య ప్రదేశంలో పడేసి దహనం చేశారు. ఈ మందులను కాల్చడం వల్ల భరించలేని దుర్వాసన వెదజల్లింది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ముక్కు మూసుకొని తపాలా కార్యాలయ సిబ్బంది పని చేశారు. టీచర్స్ క్వార్టర్స్‌లో నివాసముండే కుటుంబాల వారు ఇళ్లకు తాళాలువేసి బయటకువెళ్లిపోయారు.

పశువైద్యంలో నిర్లక్ష్యం : సిఐటియు నేత రామారావు

గ్రామాల్లో గిరిజన రైతుల పశువులు వ్యాధుల బారిన మృత్యువాత పడుతుంటే, మరో వైపు పశువైద్య కేంద్రంలో మందులు కాలం చెల్లే వరకు వినియోగించకపోవడంపై సీఐటీయూ జిల్లా నాయకుడు సిహెచ్.రామరావు అగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ పశువులకు సకాలంలో మందులు వేయకుండా, ఇప్పుడు గుట్టుచప్పుడు కాకుండా సిబ్బంది కాలం చెల్లిన మందులకు నిప్పుపెట్టారని తెలిపారు. మందులు కాల్చి బూడిద చేసి, మందులు వినియోగించినట్లు దొంగ లెక్కలు రికార్డ్స్ సృష్టిస్తున్నారని ఆరోఇంచారు. దీనిపై ఉన్నతాధికారులు సమగ్రమైన దర్యాప్తు నిర్వహించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కాలం చెల్లిన పశు మందులను కాల్చుతున్న దృశ్యం

ప్రతి కార్యకర్తకూ పార్టీ అండ

వైసిపి డిజిటల్ బుక్ ఆవిష్కరించిన ఎంపీ, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-పాడేరు: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రూపొందించిన డిజిటల్ బుక్"ను పాడేరు శాసన సభ్యులు అల్లూరి జిల్లా అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వరరాజు, ఎంపీ "గుమ్మ తనూజరాణి, అరకు శాసన సభ్యులు రేగం మత్యలింగం, అరకు పార్లమెంట్ పరిశీలకులు బొడ్డేటి ప్రసాద్, మాజీ శాసన సభ్యులు చెట్టి పాల్గుణలు శనివారం స్థానిక వైసీపీ క్యాంప్ కార్యాలయంలో డిజిటల్ బుక్ యాప్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఉద్దేశించి విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడిపిస్తూ వైయస్సార్ కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందికి గురి చేస్తుందన్నారు. అన్యాయానికి గురైన ప్రతీ కార్యకర్తకు అండగా ఉండాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి డిజిటల్ బుక్ యాప్ ప్రారంభించారన్నారు. కూటమి నాయకులు ఎటువంటి భయ బ్రాంతులు గురి చేసి తప్పుడు కేసులు పెడితే ధైర్యంగా ఈ యాప్ ద్వారా సమాచారం తెలియ పరచాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాడేరు అరకు నియోజకవర్గాల మండల పార్టీ అధ్యక్షులు, ఎంపీపీ లు, జడ్పీటీసీలు, నాయకులు, సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోధిస్తున్న కుటుంబ సభ్యులు

వ్యాక్సిన్ వికటించి పసికందు మృతి

ప్రజాశక్తి- డుంబ్రిగుడ: మండలంలోని రంగిలిసింగి పంచాయతీ కుజభంగిలో వ్యాక్సిన్ వికటించి పసికందు మృతి చెందిన విషాదర సంఘటన చోటు చేసుకుంది. దీనికి సంబంధించి బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాలు. కుజభంగి గ్రామానికి చెందిన అగతమ్మిడి లావణ్య, ప్రవీణ్ కుమార్ దంపతులకు రెండు నెలల పసికందు ఉన్నారు. ఈనెల 24న ఆ గ్రామంలో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ పసికందుకు వ్యాక్సిన్‌ను వైద్య సిబ్బంది వేశారు. వ్యాక్సిన్ వేసినప్పటి నుంచి పసికందుకు జ్వరం రావడంతో శుక్రవారం తెల్లవారు జామున పసికందు ఊపిరాడక మృతి చెందిందని బాధిత కుటుంబీకులు తెలిపారు.ఈనెల 24న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని వైద్య సిబ్బంది నిర్వహించడం వాస్తవమేనని, వైద్య సిబ్బంది వ్యాక్సినేషన్ వేసే సమయంలో పసికందు ఆరోగ్యంగానే ఉన్నారని వైద్యాధికారి రాంబాబు తెలిపారు. వ్యాక్సిన్ వేస్తే సాధారణ జ్వరం ఉంటుందన్నారు. పుట్టుకతోనే పసికందుకు మూర్ఛ లక్షణాలు ఉన్నాయన్నారు. జ్వరంతోనే కూడిన మూర్ఛ పసికందుకు వచ్చిందన్నారు. బాధిత కుటుంబీకులు పసరు మందును పట్టించడంతో పరిస్థితి వికటించి పసికందు మృతి చెందినట్లు నిర్ధారించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

ప్రజాశక్తి -అనంతగిరి: ప్రోటీన్లతో కూడిన ఆహార పదార్థాలను గర్భిణీలు, బాలింతలు తీసుకోవాలని అంగన్వాడి సూపర్వైజర్ షకీలా, స్థానిక సర్పంచ్ జె. లక్ష్మీలు సూచించారు. కాశీపట్నం పంచాయతీ పరిధి బంగారంపేట గ్రామంలో పోషణ మాసోత్సంలో భాగంగా అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు ఆకుకూరలు, పప్పు దినుసులు ఎక్కువగా తీసుకున్నప్పుడే ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. పుట్టే బిడ్డ కూడా ఆరోగ్యంగా జన్మిస్తారని సూచించారు. ప్రభుత్వం ఐసిడిఎస్ కేంద్రాలలో సరఫరా చేస్తున్న ఆహారాలను క్రమం తప్పకుండా తీసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ .దేముడు, సిబ్బంది, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిఎస్‌టిపై అవగాహన

ప్రజాశక్తి- కొయ్యూరు: మండలంలోని నడింపాలెం, బట్ట పణుకుల, రావణాపల్లి పంచాయతీల్లో సచివాలయాలను ఎంపిడిఒ శనివారం పరిశీలించారు. దీనిలో భాగంగా జిఎస్‌టిపై డోర్‌టు డోర్ క్యాంపైన్‌పై సిబ్బందికి సూచనలు ఇచ్చారు. దీనిపై ప్రజలకు నేరుగా అవగాహన కల్పించటం జరిగిందని తెలిపారు. పి4 అమలు విధానంపై తక్షణం సిబ్బంది చేయాల్సిన పనులు గురించి వివరించారు. అనంతరం సచివాలయ రికార్డులు పరిశీలించారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ

విఆర్‌పురం: మండలంలో జిఎస్‌టి తగ్గింపునకు సంబంధించి కొత్త జిఎస్‌టి రేట్లు అమల్లోకి వచ్చిన తర్వాత మొత్తం 375 రకాల వస్తువులు ఉత్పత్తుల ధరలు తగ్గాయి. ఈ క్రమంలో ఏమైనా సమస్యలు ఉంటే ఫిర్యాదులు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ వినియోగదారుల హెల్ప్‌లైన్‌లోని ఎన్‌గ్రామ్ పోర్టల్‌లో స్పెషల్ విభాగాన్ని ఏర్పాటు చేసినట్టు ఎంపిడిఒ ఇమాన్యుయెల్ తెలిపారు. వి ఆర్ పురం, రేఖపల్లి దుకాణదారులు వద్దకి వెళ్లి జిఎస్‌టిపై పాత, కొత్త ధరల పట్టిక ఏర్పాటు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి వాళ్ల రంగారెడ్డి , మండల ప్రత్యేక అధికారి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కుళాయిల చుట్టూ ఉన్న మురుగునీరు

కుళాయిల వద్ద పారిశుధ్యలోపం

ప్రజాశక్తి- కొయ్యూరు : మండలంలోని పంప పంచాయతీ తుమ్మలమందలో మురుగునీరుతో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయని గ్రామస్తులు వాపోతున్నారు. తాగునీటి కుళాయిల వద్ద మంచినీరు కంటే మురుగునీరే ఎక్కువ ప్రవహిస్తోందని వాపోతు న్నారు. గ్రామంలో డ్రైనేజీలు లేక మురుగనీరు రోడ్లపైనే ప్రవహిస్తోంద న్నారు. ఈ విషయమై పలుమార్లు పంచాయతీ అధికారులకు తెలిపినా ఫలితం లేదని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

పౌష్టికాహార ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి- కొయ్యూరు: పౌష్టికాహారంతోనే ఆరోగ్యం వస్తుందని ప్రత్యేకించి మహిళలు పౌష్టికాహారం తీసుకోవాలని రాజేంద్రపాలెం వైద్యాధికారి తెలిపారు. స్వస్థ్‌నారీలో భాగంగా రాజేంద్రపాలెం పిహెచ్‌సి మంప పంచాయతీ సబ్‌సెంటర్‌లో నిర్వహించిన ప్రత్యేక వైద్యశిబరంలో ఆయన పాల్గొన్నారు. సహజ పోషకాలపై మహిళలకు అవగాహన కల్పించేందుకు పోషకాహార ప్రదర్శన ఏర్పాటు చేశారు. రాజేంద్రపాలెం సెక్టార్‌కి సంబంధించి మంపలో అంగన్వాడీలు నిర్వహించిన పౌష్టికా హార స్టాల్స్ ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో రాజేంద్రపాలెం వైద్యాధికారితో పాటు రాజేంద్రపాలెం పిహెచ్‌సి సిబ్బంది,అంగన్‌వాడిలు పాల్గొన్నారు.

రహదారిపై కూలిన భారీ వృక్షం

బచ్చులూరి వద్ద రహదారిపై కూలిన వృక్షం

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం సీలేరు ధారకొండ దుప్పిలివాడ పరిసర గ్రామాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. శుక్రవారం అర్ధరాత్రి తర్వాత సీలేరులో కుండపోత వర్షం కురిసింది. తెల్లవారేసరికి తగ్గుముఖం పట్టింది. బొడ్డ గండి పంచాయితీ బచ్చులూరు వద్ద రహదారికి అడ్డంగా భారీ వృక్షం కూలిపోయింది. దీంతో రాకపోకలకు కొంతమేరకు అంతరాయం ఏర్పడింది. అనంతరం వాహనచోదకులు సమీప గ్రామస్తుల సహకారంతో వృక్షాన్ని తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు.

బస్సులు, రైళ్లు కిటకిట

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దసరా సందర్భంగా బస్సులు,రైళ్ల ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. గత రెండు రోజుల నుంచి ద్వారకా బస్ స్టేషన్‌తో పాటు, మద్దిలపాలెం, మధురవాడ ప్రాంతాల నుంచి వివిధ నగరాలకు వెళ్లే బస్సులు ప్రయాణికులతో రద్దీగా నడుస్తున్నాయి. కాంప్లెక్స్‌లో ఇటీవల ఎన్నడూ చూడనంత స్థాయిలో ప్రయాణికుల సందడి కనిపిస్తోంది. విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి స్వగ్రామాలకు, వెళుతున్నారు. దసరా రద్దీ దష్ట్యా విజయనగరం జోన్ నుంచి వివిధ ప్రాంతాలకు 1500 ప్రత్యేక బస్సులు నడుపు తున్నట్లు ఆర్టీసి రీజినల్ మేనేజర్ అప్పలనాయుడు తెలిపారు. హైదరాబాద్‌కు 10, శ్రీకాకుళం నుంచి 280, పార్వతీపురం నుంచి 140, విజయనగరం నుంచి 160, అల్లూరి జిల్లా నుంచి 25, అనకాపల్లి జిల్లా నుంచి 35, మొత్తం 650 బస్సులు విశాఖ నగరానికి ప్రత్యేకంగా నడుపుతున్నట్టు చెప్పారు. అలాగే జోన్ నుంచి విజయవాడకు 280, రాజమండ్రికి 200, ఇతర ప్రాంతాలకు మరో 370 బస్సులు నడుపుతున్నట్టు చెప్పారు. మహిళలకు ఉచిత ప్రయాణాలు లేని గరుడ వగైరా బస్సుల సంఖ్యను కూడా పెంచడం జరిగిందన్నారు. దసరా కోసం చార్జీలను పెంచలేదన్నారు. స్థానిక రైల్వేస్టేషన్‌లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ప్రైవేటు బస్సుల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా చార్జీలను పెంచారు.

నియోజకవర్గ సమస్యల ప్రస్తావన హర్షణీయం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: రంపచోడవరం నియోజకవర్గ ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అసెంబ్లీలో నియోజకవర్గ సమస్యలపై ప్రస్తావించడం హర్షించదగ్గ విషయమని జిల్లా ఎస్‌టి సెల్ అధ్యక్షుడు తమదాల సత్యనారాయణ, రాజవొమ్మంగి మండల మాజీ జెడ్‌పిటిసి కోసూరి బుజ్జిచిన్నాలమ్మ అన్నారు. శనివారం వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే శిరీష అసెంబ్లీలో ఇప్పటికే డిఎస్‌సి ద్వారా గిరిజన ఉద్యోగార్థులు నష్టపోయారని, త్వరతగతిన జిఒ తెచ్చి ఏజెన్సీ డిఎస్‌సి నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతిపత్రం కూడా ఇచ్చారన్నారు. అంతేకాకుండా ఐటిడిఎ ల పనితీరు మెరుగుపర్చాలని, దానిలో ఖాళీలు గిరిజనులతో భర్తీ చెయ్యాలని ఎమ్మెల్యే అసెంబ్లీలో ప్రస్తావించారన్నారు. ఎమ్మెల్యేకు గిరిజన నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు కోపూరి రత్నం, పార్టీ నాయకులు బారంగి అనుదీప్, చెక్కా పండుబాబు, తెడ్ల రాంబాబు, కాకూరి చిన్న పాల్గొన్నారు.

వాహనదారులు లైసెన్స్ కలిగిఉండాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా వాహనాలకు సంబంధించి లైసెన్స్‌లు కలిగి ఉండాలని రంపచోడవరం ఆర్టిఒ రాజేష్ కుమార్ అన్నారు. శనివారం మండలంలోని రాజఒమ్మంగి కెనరా అడ్డురోడ్డు జడ్డంగి తదితర ప్రాంతాల్లో వాహన తనిఖీలు విస్తతంగా నిర్వహించారు. రహదారి మీదుగా వచ్చిపోయే ప్రతి వాహనాన్ని ఆపి రికార్డులు పరిశీలించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలించరాదని ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని వాహనదారులకు సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. లైసెన్స్ ఏ విధంగా పొందాలో గ్రామస్తులకు,ఆర్టీవో రాజేష్ కుమార్ వివరించారు. ఈ సందర్భంగా రికార్డులు సక్రంగా లేని ఆరు వాహనాలకు సంబంధించి రూ.46వేలు జరిమానా విధించామన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న ఆర్టిఒ రాజేష్‌కుమార్

వైద్యశిబిరం ప్రారంభిస్తున్న దృశ్యం

వాతంగిలో వైద్యశిబిరం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలోని వాతంగి సచివాలయం వద్ద స్వస్థ్‌నారీ సశక్త్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది శనివారం వైద్యశిబిరం నిర్వహించి మహిళలకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ రాళ్లగడ్డ అర్జున్ మాట్లాడుతూ మహిళల ఆరోగ్యంగా ఉంటే కుటుంబం అంతా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతిష్ఠ చేస్తున్న వినాయకుడు

వైభవంగా వినాయక విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి-వి.ఆర్.పురం: వడ్డిగూడెం పంచాయతీ పెట్టవీధిలో శనివారం వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ముందుగా భక్తులు విగ్రహాన్ని గ్రామంలో ఊరేగింపు చేశారు. అనంతరం ప్రధానార్చకులు సౌమిత్రి పురుషోత్తమాచార్యులు వేద మంత్రాలతో, విగ్రహదాత టిడిపి సీనియర్ నాయకుడు, మండల అధ్యక్షుడు ఆచంట శ్రీనివాసరావు దంపతుల చేతుల మీదుగా ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. ప్రతిష్ఠ అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. జెడ్‌పిటిసి వాళ్ల రంగారెడ్డి, బొర్రా నరేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గంగవరం వంతెన

ప్రమాదకరంగా వంతెన

ప్రజాశక్తి-సీలేరు: జికె వీధి మండలం దారకొండ పంచాయతీ పరిధి గంగవరం పరిసర ప్రాంతాల్లో గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు గంగవరం వంతెన కొట్టుకుపోయింది. గిరిజనులు శ్రమదానంతో రాకపోకలు సాగించడానికి తాత్కాలికంగా కర్రలు, మట్టితో వంతెన నిర్మించారు. ప్రస్తుతం కురిసిన వర్షాలకు వంతెనపై వేసిన కర్రలు, మట్టి కొట్టుకుపోయి ప్రమాద భరితంగా తయారైంది. దీంతో రాకపోకలు సాగించడానికి ఇబ్బందిగా ఉందని అధికారులు స్పందించి శాశ్వతంగా వంతెన నిర్మించాలని గిరిజనులు కోరుతున్నారు.

బాల్య వివాహాలు చట్ట విరుద్ధం

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్: బాల్యవివాహాలు చట్ట విరుద్ధమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. శనివారం జిల్లాన్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో సంస్థ కార్యాలయంలో 'బాల్య వివాహాలు, శైశవ వివాహాలు, దాని దుష్ప్రభావాలు' అంశంపై సదస్సు నిర్వహించారు. సదస్సుకు అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ, బాల్య వివాహాలు చట్టవిరుద్ధమని, దీనివల్ల బాలికల ఆరోగ్యం, విద్య, భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందన్నారు. ముఖ్యంగా, చిన్నవయసులో గర్భధారణ వల్ల తల్లీబిడ్డల ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం పడుతుందన్నారు. అవసరమైన వారికి ఉచిత న్యాయ సహాయం అందించడానికి డిఎల్ఎస్ఎ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం సమావేశానికి హాజరైన ప్రతి ఒక్కరితో బాల్య వివాహాలను నివారించడానికి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ పిడి కె.రమాలక్ష్మి, విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మాధవి గణపతి, వాసవ్య మహిళా మండలి, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

లింగేశ్వరరావుకు కమిషనర్ అభినందన

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఇటీవల తైవాన్‌లో ముగిసిన ప్రపంచ సీనియర్ బ్యాడ్మింటన్ పోటీల్లో విశాఖ నగరానికి చెందిన బ్యాడ్మింటన్ క్రీడాకారుడు స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి బివిఎస్‌కె లింగేశ్వరరావు రజిత పతకాన్ని సాధించారు. ప్రపంచవ్యాప్తంగా 54 దేశాల నుండి సుమారు 1700 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. మన దేశానికి చెందిన 198 మంది పాల్గొన్నారు. ఈ పోటీల్లో విశాఖపట్నంనకు చెందిన లింగేశ్వరరావు మిక్స్‌డ్ డబుల్ విభాగంలో పతకాన్ని సాధించారు. ఈ సందర్భంగా ఆయనను శనివారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలో జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్ , 43వ వార్డు కార్పొరేటర్ , జనసేన నాయకురాలు, ఈవెంట్స్ ఎస్‌బి ఎవి డి కార్యదర్శి ఉషశ్రీ అభినందించారు.

ప్రొస్టేట్ సమస్యకు సరికొత్త చికిత్స

-ఎఐఎన్‌యు ఎండి రవీంద్రవర్మ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎఐఎన్‌యు ఆసుపత్రిలో ప్రొస్టేట్ సమస్యకు సరికొత్త ప్రమాణాలతో చికిత్స సాధించడం జరిగిందని, లేజర్ సాయంతో నొప్పి లేకుండా శస్త్రచికిత్స నిర్వహించడం జరుగుతుందని ఆసుపత్రి యూరాలజిస్టులు డాక్టర్ రవీంద్రవర్మ, డాక్టర్ అమిత్‌సాప్లే, డాక్టర్ పి.శ్రీధర్ తెలిపారు. శనివారం ఆస్పత్రిలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ అత్యాధునిక సదుపాయాలు, శిక్షణ పొందిన సిబ్బంది, లేజర్ టెక్నాలజీ సాయంతో ఇక్కడ హూలెప్ చికిత్సలు చేస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి నైపుణ్యం ఉన్న ఆస్పత్రులు దేశంలోనే అతి తక్కువగా ఉన్నాయన్నారు. ఎఐఎన్‌యు మేనేజింగ్ డైరెక్టర్,సీనియర్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్ జి.రవీంద్రవర్మ మాట్లాడుతూ, జీవన ప్రమాణాలు పెరగడంతో చాలామంది పురుషులకు షుగర్, బిపితో పాటు ప్రోస్టేట్ సమస్య కూడా ఉంటోందన్నారు. ఈ సమస్యకు హూలెప్ సరైన పరిష్కారం అన్నారు.